# పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం..

- లింగంపల్లిలో కేటీఆర్ రోడ్‌షో అదుర్స్
- గులాబీ శ్రేణులతో కిక్కిరిసిన తారానగర్, ఆల్విన్‌కాలనీ
- ఆకట్టుకున్న బోనాలు, డప్పుల దరువులు



ఆల్విన్‌కాలనీ లాస్ట్‌బస్‌స్టాప్‌లో మంత్రి కేటీఆర్ రోడ్‌షోకు హాజరైన ప్రజలు

శేరిలింగంపల్లి, నవంబర్ 22: శేరిలింగంపల్లిలో కేటీఆర్ రోడ్‌షో బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపింది. బుధవారం రాత్రి నియోజకవర్గంలోని లింగంపల్లి డివిజన్ తారనగర్ మార్కెట్ నుంచి బీహెచ్‌ఈఎల్ కూడలి, చందానగర్, మదీనగూడ ప్రాంతాల మీదుగా మియాపూర్ ఆల్విన్‌కాలనీ వద్ద ముగిసింది. తారానగర్ తుల్జాభవానీ దేవాలయం సమీపంలో కేటీఆర్ రోడ్‌షో ఆకట్టుకుంది. గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, భారతీనగర్, చందానగర్‌లకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీఆర్‌ఎస్ అభిమానులు, స్థానికులు వేల సంఖ్యలో చేరుకుని మంత్రి కేటీఆర్‌కు ఘనస్వాగతం పలికారు. ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి చంద్రశేఖర్, శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, భారతీనగర్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి, గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాల ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తారానగర్‌కు చేరుకున్నారు. దీంతో తారానగర్ మార్కెట్ ప్రాంతం వేలాది మంది గులాబీ శ్రేణులతో కిక్కిరిసిపోయింది. ఎటుచూసినా గులాబీ జెండాల రెపరెపలు, జై కేసీఆర్..జై జై కేటీఆర్ నినాదాలతో ఆ ప్రాంతం మారుమోగింది. గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ సాయిబాబా ఆధ్వర్యంలో డప్పుల దరువు బృందాలు, తెలంగాణ సాంప్రదాయ బోనాలు ఎత్తుకున్న మహిళలు సాంప్రదాయ నృత్యాలతో భారీ ర్యాలీగా తారానగర్ రోడ్‌షో ప్రాంగణానికి చేరుకుని హోరెత్తించారు. యువజన నాయకులు రాగం అనిరుధ్ యాదవ్ ఆధ్వర్యంలో యువకులు డీజే దరువులతో అదరగొట్టారు. మంత్రి కేటీఆర్‌పై గులాబీ పూలవర్షం కురిపించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్ రెడ్డితో కలిసి రోడ్‌షోలో పాల్గొన్న మంత్రి కేటీఆర్ తన అద్భుతమైన ప్రసంగంతో అందరినీ ఆకట్టుకున్నారు. తెలుగు, హిందీ బాషాల్లో తన ప్రసంగాన్ని ఇచ్చిన కేటీఆర్ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు తనదైన శైలిలో వివరిస్తూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో శేరిలింగంపల్లిలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రస్తావిస్తూ బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నింపారు. మాదాపూర్ డీసీపీ సందీప్ ఆధ్వర్యంలో చందానగర్ పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.



జై గాంధీ అంటూ ఎమ్మెల్యే గాంధీకి మద్దతుగా నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



ఆల్విన్‌కాలనీ లాస్ట్‌బస్‌స్టాప్‌లో రోడ్ షోలో ప్రసంగిస్తున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ నేతలు



మియాపూర్ ఇంద్రారెడ్డి కాలనీలో..



## గులాబీమయమైన ఆల్విన్ కాలనీ

మాదాపూర్, నవంబర్ 22: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ చౌరస్తాలో బీఆర్‌ఎస్ శ్రేణులతో గులాబిమయంగా మారింది. ఎన్నికల నేపథ్యంలో మంత్రి కేటీఆర్ రోడ్డు షోలో భాగంగా స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున విచ్చేసి మంత్రి కేటీఆర్‌కు స్వాగతం పలికారు. కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో పాటు మాదాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, హఫీజ్‌పేట్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బాలింగ్ గౌతమ్ గౌడ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు దాత్రి గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్, స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్లకార్డులు, జెండాలను పట్టుకొని 'జై కేసీఆర్ .. జై కేటీఆర్.. జై గాంధీ అన్న' అంటూ నినాదాలు చేస్తూ పార్టీ నాయకుల్లో నూతన ఉత్సాహన్ని నింపారు. కాలనీలో మహిళలు, చిన్న, పెద్ద అనే తేడా లేకుండా మంత్రి కేటీఆర్ ప్రసంగాన్ని ఆసక్తితో వీక్షించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు దాత్రి గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లైటింగ్ ప్లకార్డులు ప్రత్యేక ఆకర్శణగా నిలిచాయి. మహిళలు, పార్టీ నాయకులు ఉత్సాహంగా నృత్య ప్రదర్శనలు చేస్తూ ఉషారెత్తించారు.



బీఆర్‌ఎస్ శ్రేణులతో కిక్కిరిసిన ఆల్విన్ కాలనీ

### ఆల్విన్ కాలనీ లాస్ట్ బస్‌స్టాప్‌లో ..

ఎన్నికల ప్రచార నేపథ్యంలో మంత్రి కేటీఆర్ రోడ్డు షోలో భాగంగా కార్పొరేటర్లు వెంకటేశ్ గౌడ్, నార్నె శ్రీనివాస్ రావు, మాధవరం రోజాదేవి, జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావుల ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో విచ్చేసి మంత్రి కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. ప్లకార్డులు, జెండాలతో పాటు గులాబీ తోరణాలతో ప్రాంతం గులాబీమయంగా మారింది. మంత్రి కేటీఆర్ రాకతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొనడంతో నృత్యాలు చేస్తూ జై బీఆర్‌ఎస్ .. జై కేసీఆర్.. జై కేటీఆర్ అంటు నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో మంద్రి కేటీఆర్ విచ్చేసి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. బీఆర్‌ఎస్ ప్రవేశపెట్టిన పథకాలతో పాటు ముమ్మందు చేపట్టబోయే పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్, దాత్రి గౌడ్ తదితరులు ఉన్నారు.

## గాంధీని అధిక మెజార్టీతో గెలిపించుకుందాం..



హైదర్‌నగర్ డివిజన్‌లో ఇంటింటి ప్రచారంలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు

మియాపూర్, నవంబర్ 22 : శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీని అధిక మెజార్టీతో ఎన్నికలలో గెలిపించుకోవాలని హైదర్‌నగర్, ఆల్విన్ కాలనీ డివిజన్ల కార్పొరేటర్లు నార్నె శ్రీనివాస్‌రావు, దొడ్ల వెంకటేశ్ గౌడ్‌లు పిలుపునిచ్చారు. గాంధీకి మద్దతుగా తమ డివిజన్‌లలో పార్టీ శ్రేణులతో కలిసి బుధవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. హెచ్‌ఎంటీ శాతవాహనలో పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్లు మాట్లాడుతూ.. అనునిత్యం అందుబాటులో ఉండి సేవలను అందిస్తూ అభివృద్ధికి పాటు పడే గాంధీ మూడోసారి ఘన విజయం తథ్యమనిఅన్నారు. కారు గుర్తుకే ఓటు వేసి ప్రభుత్వాన్ని కొనసాగించాలని కార్పొరేటర్లు శ్రీనివాస్ రావు, వెంకటేశ్ గౌడ్ కోరారు.



ఆల్విన్ కాలనీ డివిజన్ పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్లు దొడ్ల వెంకటేశ్ గౌడ్, నార్నె శ్రీనివాస్‌రావు

### సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం

కొండాపూర్, నవంబర్ 22 : తెలంగాణను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తూ, రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కే సాధ్యమని చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథరెడ్డి అన్నారు. బుధవారం ఆమె శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీకి మద్దతుగా డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న అరెకపూడి గాంధీని భారీ మెజార్టీతో గెలిపించి, గులాబీ జెండాను ఎగరేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.



చందానగర్‌లో ఇంటింటి ప్రచారంలో కార్పొరేటర్ మంజులరెడ్డి

## పోలీసులకు ముగిసిన ఓటింగ్



శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎన్నికల అధికారి కార్యాలయంలో రెండు రోజులుగా పోలీసులకు కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ బుధవారంతో ముగిసింది. నియోజకవర్గంలో ఓటర్లు అయి వివిధ ప్రాంతాలలో ఎన్నికల విధులలో పాల్గొనే పోలీసులు ముందస్తుగా ఫాం 12 ద్వారా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఇలా నియోజకవర్గంలో సుమారు 400 వరకు దరఖాస్తులు అందించగా.. వారికి మంగళ, బుధవారాలలో ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. ఆర్వో శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో ఈ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ పూర్తయింది.

– మియాపూర్, నవంబర్ 22